క్లుప్తంగా

నరసప్పకు డాక్టరేట్



తిరుపతి సిటీ: ఎస్వీయూ తెలుగు అధ్యయన శాఖ పరిశోధక విద్యార్థి పూలరాతి నరసప్పకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన రిటైర్డ్ ప్రొఫెసర్ పేట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో కర్నూలు జిల్లా రైతు కథలు–అనుశీలన అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు తహసున్నీసా బేగం ఆధ్వర్యంలో ట్రస్ట్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం విద్యార్థులకు దుప్పట్లు పంచారు. అనంతరం అన్నదానం చేశారు. ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తహసున్నీసా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు.

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కమిటీ ఎంపిక



యూనియన్ నూతన కమిటీ

తిరుపతి కల్చరల్: శ్రీబాలాజీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నగర నూతన కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. ఈ మేరకు యూనియన్ వ్యవస్థాపకుడు ఎం.తంగవేలు అధ్యక్షతన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా ఎం.శేఖర్, ప్రధాన కార్యదర్శిగా జె.రమణ, కార్యదర్శిగా నరసింహులు, ఉపాధ్యక్షుడిగా చిరంజీవి, గౌరవ సలహాదారుడిగా డి.అల్లాబాషా, కోశాధికారిగా ఇ.రాములుతోపాటు ఐదుగురు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు.

విజేతగా మంగళం జట్టు

ఏర్పేడు: మండలంలోని మన్నసముద్రంలో ఆదివారం మన్నసముద్రం యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో మంగళం జట్టు విజేతగా నిలిచింది. టోర్నమెంట్‌లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన 30 జట్లు పాల్గొన్నాయి. మన్నసముద్రం, మంగళం జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. రెండు జట్లు తలపడగా మంగళం జట్టు విజేతగా నిలించింది. విజేత జట్టుకు జ్ఞాపికతో పాటు రూ.10 వేలు నగదు బహుమతిని అందజేశారు. మన్నసముద్రం జట్టుకు రూ.7 వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో తాళ్లపాక సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరువీధులు జలమయం



తిరుపతి నగరంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వీధులంతా జలమయమయ్యాయి. వర్షపునీరు మోకాలి లోతు నిలవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. తీర్థకట్టవీధి, గాంధీరోడ్డు, శ్రీదేవి కాంప్లెక్స్ రోడ్డు, మున్సిపల్ ఆఫీస్ రోడ్డు, కరకంబాడి రోడ్డు, చేపల మార్కెట్ రోడ్డు తదితర రహదారులపై వర్షపు నీరు ప్రవహించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి















నిబంధనలు మీరుతున్నారు

తమ అభిమాన నాయకులు, పార్టీల సింబల్స్‌ను తమ బైక్‌ల నంబర్ ప్లేట్లపై వేసుకుని నిబంధనలు మీరుతున్నారు. మరికొందరైతే తమ వాహన నంబర్లను బాస్, శశి ఇలా వారికి అనుగుణంగా మార్చేసుకుంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు సైతం నంబర్ ప్లేట్లపై వారి రాతలను చూసి అవాక్కవుతున్నారు. ఇవి నంబర్ ప్లేట్లా లేక నోటీస్ బోర్డులా అని వాహనదారులను ప్రశ్నిస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి





ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు





భరత నాట్యంతో అలరిస్తున్న కళాకారులు

చంద్రగిరి(తిరుచానూరు): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించింది. తిరుపతికి చెందిన రిషాన్వీ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనాట్యం విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో భాగంగా మూషిక వాహన, అదివో అల్లదివో, పుష్పాంజలి, వెంకటాచల నిలయం, నటేష కౌత్యం, వెయ్యి నామాల వాడ, బ్రహ్మమొక్కటే, కొమ్మలాల, ఒకపరి ఒకపరి, ఏకదంతాయ, శివ శివ శంకర, చూడచక్కని తల్లి, ముద్దుగారే యశోద, వచ్చెను అలమేలు మంగ తదితర పాటలకు కళాకారులు రిషిశ్రీ, అవని, వినుక్తన, సాయి, అక్షర, నందన, ఆగ్నిక, వేద, జ్ఞానరుతిక, హిందు, కుషి, లీలా, మోక్షిత, చతురికల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సాంస్కృతిక కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో యూపీ మంత్రులు





అమ్మవారిని దర్శించుకున్న యూపీ మంత్రులు ధర్మవీర్ ప్రజాపతి, పండిట్ శ్రీసునీల్ భరాల

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర మంత్రులు ధర్మవీర్ ప్రజాపతి, పండిట్ శ్రీసునీల్ భరాల వేర్వేరుగా వారి కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న వారికి ఆలయ ఏఈఓ రమేష్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి బ్రహ్మానందరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకిరాత వారాహి దేవికి ప్రత్యేక పూజలు



శ్రీ కిరాత వారాహి దేవి

రామచంద్రాపురం: రాయలచెరువు కట్ట సమీపంలోని శ్రీశక్తిపీఠంలో జరుగుతున్న వారాహి నవరాత్రులలో భాగంగా ఆలయంలో కొలువైన శ్రీశ్వేతవారాహి దేవి అమ్మవారు ఆదివారం శ్రీకిరాత వారాహి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నేపథ్యంలో శ్రీశక్తిపీఠ వ్యవస్థాపకులు శ్రీసిద్దేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ శ్రీ రమ్యానంద భారతీ పీఠంలో కొలువైన వారాహి అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య పూజలు ప్రారంభించారు. వేద పండితులు శ్రీకిరాత వారాహి దేవికి మంత్రాలతో హోమం జరిపించారు. ఆలయ నిర్వాహకులు పూజలో పాల్గొన్న భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందించారు.



హోమం జరుపుతున్న వేద పండితులు

బీజేకేపీ రాష్ట్ర నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



ఐక్యత చాటుతున్న బీజేకేపీ రాష్ట్ర కమిటీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: భారతీయ జవాన్ కిసాన్ పార్టీ(బీజేకేపీ) రాష్ట్ర నూతన కమిటీ ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ మేరకు ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో బీజేకేపీ జాతీయ కో–ఆర్డినేటర్ సుదర్శి మోహనరావు నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కె.రాజేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడిగా డి.నరసింహారెడ్డి, కార్యదర్శిగా బి.శివప్రసాద్, లీగల్ అడ్వయిజర్‌గా ఎస్. రవికుమార్‌తోపాటు కమిటీ సభ్యులుగా కె.కిశోర్‌కుమార్, కుప్పస్వామి, శ్రావణ్‌కుమార్, పాండురంగారావు ప్రమాణం చేశారు. అనంతరం సుదర్శి మోహన్‌రావు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కమిటీ ప్రతినిధులు ఐక్యతతో ముందడుగు వేస్తూ సమైక్యత కోసం కృషి చేయాలని తెలియజేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టంను సోమవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అదితిసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పబ్లిక్ గ్రీవెన్స్ ఉంటుందని, సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

సర్వీస్ రూల్స్ కోసం ఉద్యోగుల వినతి



ఎమ్మెల్సీకి వినతి పత్రం సమర్పిస్తున్న ఉద్యోగులు

తిరుపతి కల్చరల్: ఎయిడెడ్ నుంచి ప్రభుత్వంలో విలీనమైన ఇంటర్ ఉద్యోగుల సర్వీస్ రూల్స్‌ను రూపొందించాలని కోరుతూ ఏపీ ప్రభుత్వ ఇంటర్ ఉద్యోగుల సంఘం నేతలు ఆదివారం ఎమ్మెల్సీ శ్రీకాంత్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎయిడెడ్ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేసిందని తెలిపారు. మూడేళ్లు పూర్తి అయినా వారికి సర్వీస్ నిబంధనలు రూపొందించలేదని పేర్కొన్నారు. సర్వీస్ రూల్స్ రూపొందించకపోవడంతో ప్రమోషన్స్‌లో తీవ్రనష్టం జరుగుతోందని తెలిపారు. తమ సమస్యపై స్పందించి సర్వీస్ రూల్స్ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యలను విద్యాశాఖా మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ తెలియజేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉద్యోగుల సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రామాంజులు, ఎస్.వెంకట సురేష్ ఉన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు





అనురాధ పొడ్వాల్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుమల: శ్రీవారిని ఆదివారం కేంద్ర సమాచార సహాయ శాఖ మంత్రి ఎల్.మురుగన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత అనురాధ పొడ్వాల్, తెలంగాణ ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఎస్పీ హర్షవర్ధన్ రాజు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూప్రసాదాలతో సత్కరించారు.

న్యాయవిద్య నేర్చుకోవడం నిరంతర ప్రక్రియ



ప్రారంభోత్సవంలో పాల్గొన్న న్యాయమూర్తులు

తిరుపతి లీగల్: న్యాయవిద్య నేర్చుకోవడం నిరంతర ప్రక్రియ అని మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యాంప్రసాద్ తెలిపారు. తిరుపతిలో ఆదివారం నూతనంగా ఎస్ఎల్ జ్యుడిషియల్ సర్వీసెస్ అకాడమీని న్యాయమూర్తులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో న్యాయమూర్తులకు వివిధ చట్టాలు, పరిపాలనపై అవగాహన కల్పించడానికి జ్యుడిషియల్ అకాడమీలు ఉన్నాయన్నారు. తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి ఎం.గురునాథ్ మాట్లాడుతూ రాయలసీమ, కోస్తా జిల్లాలకు చెందిన న్యాయవాదులు జడ్జి పోస్టులకు, ఇతర పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకోవాలంటే హైదరాబాద్‌కు వెళ్లాల్సి ఉందని పేర్కొన్నారు. దీనికి న్యాయవాదులు చాలా సొమ్ము చెల్లించాల్సి ఉందని, అలాగే సమయం కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా తిరుపతిలో పోటీ పరీక్షలకు కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అకాడమీలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, జడ్జి పోస్టుల పోటీ పరీక్షలకు మంచి కోచింగ్ ఇవ్వనున్నట్టు ఎస్ఎల్ జ్యుడిషియల్ సర్వీసెస్ అకాడమీ డైరెక్టర్లు యండమూరి నాగేంద్రబాబు, ఆయన తనయుడు హైకోర్టు న్యాయవాది శరణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నాలుగో అదనపు జిల్లా జడ్జి అర్చన, ఐదో అదనపు జిల్లా జడ్జి రామ్‌గోపాల్, తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గోపీచంద్, ప్రొఫెసర్ కృష్ణయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు వైఎస్ఆర్ జయంతి వేడుకలు

చంద్రగిరి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు శ్రీకోదండరామస్వామి ఆలయ వీధిలోని పాత పార్టీ కార్యాలయంలో ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్ఆర్ సీపీ చంద్రగిరి ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హాజరుకానున్నారన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు నెన్నూరులో..

రామచంద్రాపురం: మండలంలోని నెన్నూరు గ్రామంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జడ్పీటీసీ ఢిల్లీరాణి, వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్ఆర్ సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

10న అయోధ్యకాండ అఖండ పారాయణం

తిరుమల: లోక కల్యాణార్థం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై జూలై 10వ తేదీ అయోధ్యకాండ 12వ విడత అఖండ పారాయణం నిర్వహించనున్నారు. నాదనీరాజనం వేదికపై ఉదయం 7 నుంచి 9 గంటల వరకు జరగనున్న ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. ఎస్వీ వేద వి/జ్ఞాన పీఠం, ఎస్వీ వేద విశ్వ విద్యాలయం, టీటీడీ వేదపండితులు, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం పండితులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అయోధ్యకాండలోని 45 నుండి 49 సర్గలలోని 141 శ్లోకాలు పారాయణం చేయనున్నారు.